# బింబ ప్రతిబింబం

## గంటి భానుమతి



అందరి భోజనాలు అయ్యాక, బోర్న్‌వీటా కలిపిన పాలున్న గిన్నెని, రెండు గ్లాసులని డైనింగ్ టేబుల్ మీద పెట్టి, మిగిలిన పాలు తోడేసి, వంటింటి లెటార్పి ముందు గదిలోకి వెచ్చింది.

''నాకీ ఎమ్సెట్లూ, ఎంట్రెన్సులూ వొద్దు. నేను కామర్సు తీసుకుంటాను'' అన్న కూతురు టేబుల్ మీద రెండు పుస్తకాలు పెట్టుకుని రాసుకుంటోంది. ఎడం చేత్తో జుట్టు కొసళ్ళని ఉంగ రాలు తిప్పుతోంది.

పదో క్లాసు చదువుతున్న కొడుకు, క్లాసు పుస్తకంలో జెఫ్రీ ఆర్చర్‌నో, సిడ్నీ షెల్డ న్‌నో కాకపోతే మరో వెంక య్యనో ఉంచి మహా సీరియస్‌గా చదివేస్తు న్నాడు. తల్లికేం తెలీదను కుంటాడు. అనుకోనీ. పుస్తకాలు చదవడం మంచి అలవాటు అని నమ్మే రుక్మిణి కొడుకుని చూసి చూడనట్లుగా ఉంది.

భర్త మాధవ్ వార్తలు వింటూ మధ్య మధ్య కొన్నింటిని అందరికీ వినిపిస్తూన్నాడు.

''మర్చిపోకుండా పాలు తాగండి...'' అని బాత్రూంలోకి దూరింది. ఆ సమయం తన కోసం కేటాయించుకున్నది. వాష్‌బేసిన్ మీదున్న అద్దంలో మొహం చూసుకుంటూ, జీవితం గురించి, యింకా ఎన్నో వాటి గురించి ఆలోచి స్తుంది.

ఆ ఒంటరితనంలో తనేమిటో తెలుసుకుం టుంది. అది ప్రైవేట్ స్పేస్. పర్సనల్ స్పేస్. ప్రశాంతంగా ఉండే ఆ సమయం ఆమె కిష్టం.

ఆ అద్దంలో రుక్మిణి కనపడదు. ఆత్మనిండిన ఆమె ప్రతిరూపం కనిపిస్తుంది. జరిగినవెన్నో ఆ ప్రతిబింబం మైండు కన్నుల్లోంచి చూస్తుంది. ఎన్నో ఊహలు. ఎన్నో ఆలోచనలు. ఏవో మాటలు చెవి దగ్గర వినిపిస్తున్నట్టుగా ఫీలవు తుంది.

కళ్ళకింద నీలినీడలు, కళ్ళజోడు ఆనవాలు, జారిన దవడలు, ముక్కు పక్కన ఏర్పడుతున్న గీతలు... యింకా ఎన్నో... ఏదో... కనిపిస్తుంది.

ఆ ఏదో ఏవిటో అద్దానికివతలున్న రుక్మిణికి తెలుసు. అది ఓ గొర్రె. పిరికి గొర్రె. మందలో నడుస్తున్న గొర్రెల్లో ఓ గొర్రె. నిర్వికారంగా ఉండే ఓ ప్రాణి.

అద్దంలోని ప్రతిబింబం గొంతు విప్పింది.

''ఏం రుక్మిణీ మారవా! ఇంత పిరికిదానిలా




ఉంటావెందుకు? నీ చుట్టూ ఉన్నవాళ్ళలో ఉండే కొద్దిపాటి ధైర్యం కూడా లేదు. నీ పిల్లలు కూడా నువ్వో చదువుకుని ఉద్యోగం చేస్తున్న దానిలాగా నిన్ను గుర్తించడం లేదు. పేపర్లు, పుస్తకాలు చదువుతావు. ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వం, అస్తిత్వం, వెన్నెముకని నిటారుగా ఉంచడం లాటి పదాల అర్థం నీకు తెలుసా: అసలు అలాంటి పదాలు నీ డిక్షనరీలో లేవా!

మందలో ఉన్న గొర్రెలా ఉంటావు. ఓ లక్ష్యం లేదు. ఓ యాంబిషన్ లేదు. ఓ పెద్ద చీమ లీడర్‌లా వెళ్తుంటే, దాని వెనకాల వెళ్ళడమే నీకు తెలిసింది. నీ ముందేం జరుగుతోంది? నీ వెనకాలేం జరుగుతోంది? నీ పక్కనెవరున్నారు? ఏం జరుగుతోంది? అవేం నీకక్కర్లేదు. నడుస్తున్నావా లేదా అన్నదే నీకు తెలుసు.

ఇవాళ మిసెస్ తివారీకి 'నో' అని చెప్ప లేదేం?''

వెంటనే ఆ వేళ జరిగింది. రుక్మిణి కళ్ళ ముందు తిరిగింది.

నత్తతో రేసు పెట్టుకోనా! లేకపోతే తాబేలుతో పెట్టుకుంటే బావుంటుందా! అన్నట్లు నడుస్తున్న గడియారం ముళ్ళని చూస్తూ బజారుకెళ్ళి ఏం కొనాలో ఆలోచిస్తూ మనసులోనే లిస్టు తయారు చేసుకుంటోంది.

గంజి పెట్టిన బెంగాలు నేత చీరని పరపర లాడించుకుంటూ ప్రిన్సిపాల్ మిసెస్ తివారి స్టాఫ్ రూంలోకి వచ్చింది. ఖాళీగా ఉంది రూం. రుక్మిణి ఒక్కత్తె ఉంది.

రుక్మిణిని చూసి నవ్వింది. ఎర్ర రంగు పెదాల వెనక తెల్ల పొట్టి ముత్యాలు తళుక్కుమన్నాయి.

తివారీ నవ్వు చూస్తే రుక్మిణికి భయం. అలా నవ్విందంటే తనతో ఏదో పనుందన్న మాటే. ఈ మాటు 'నో' చెప్పాలి అని నిశ్చయించుకుంది.

''ఇవాళ వ్యాసరచన పోటీలున్నాయి. ఈ ఏరియాలో ఉన్న ఆరు జూనియర్ కాలేజీల పిల్లలు పాల్గొంటున్నారు. మీరుండండి. లంచ్ నే నేర్పాటు చేస్తాను...'' మళ్ళీ నవ్వింది.

సరిగ్గా ఏడు రోజుల క్రితం... శనివారం నాడు, ఇలాగే నవ్వింది. డిబేటుంది. జడ్జీగా నీ కనుభవం ఉంది. నీది చాలా ఇంపార్షియల్‌గా ఉంటుంది. బయట కాలేజీ వాళ్ళున్నారు. మన దగ్గర్నుంచి నువ్వుండు... ఆ శనివారం అంతా డిబేటు పోటు.

మళ్ళా ఈ శనివారం కూడానా! మనసు మూలిగింది... వెంటనే తేరుకుంది.

''ఇది హిందీ ఎస్సే రైటింగ్ కదా...''

మళ్ళా నవ్వింది. ఈసారి పళ్ళు కనపళ్ళేదు.

''నిజమే. నీలం లూత్రా కండక్ట్ చేయాలి. ఆవిడకేదో అర్జంటు పని వచ్చిందని పదకొండు గంటలకే వెళ్ళిపోయింది. సబ్‌స్టిట్యూట్ కోసం చూస్తున్నాను'' మళ్ళా చిరునవ్వు.

నిస్సహాయంగా చూసింది ఆమె వైపు

''నాకు తెలుసు. నువ్వు నామాట కాదనవు. అందుకే నేనింకెవర్నీ అడగకుండా నీ కోసం, నిన్నే వెతుక్కుంటూ వచ్చాను. 'సక్సెస్' అయ్యాను. లంచ్‌టైంలో టిఫిన్ ఏదైనా తెప్పించుకో... బిల్ నా చేతికివ్వు...'' అంటూ నవ్వుతూ, హుందాగా తలతిప్పి మరెంతో హుందాగా వెళ్ళిపోయింది.

ఆమె మాటల్లో వ్యంగ్యం ఎంతుందో, పొగడ్త ఎంతుందో చాలాసేపు ఆలోచించాలనుకుంది. కానీ, అదే సమయానికి మిగిలిన స్టాఫ్ రావడంతో ఆ ఆలోచనని విరమించుకుంది.

ప్రతిబింబం లోంచి చూసిన దృశ్యాలతో రుక్మిణి కుంచించుకుపోయింది. మళ్ళా ప్రతిబింబం గొంతు విప్పింది.

''ఓ వంట మనిషిలా కాకుండా, జీవం లేని ఓ ఫ్రిజ్, టీవీలా కాకుండా, చైతన్యం నిండిన మనిషిలా, ఏదో ఏదోగా నిరూపించుకోవాలన్న తహతహ నీలో రావాలి రుక్మిణీ... జీవితం మీద కొత్త ప్రశ్నలు పుట్టాలి... జవాబులు వెతకాలి... లేదా దానికోసం ప్రయత్నించాలి. ఆ చైతన్యం మార్పు తెస్తుంది. అది కాలంతో వచ్చే మార్పు. అది తెచ్చే మార్పు. అందులోంచే ఎదగడం వస్తుంది. అదే పరిణతి...'' యింకా ఏదో ప్రతిబింబం అంటూనే ఉంది. అద్దంలోని రుక్మిణి ప్రభావం ఎక్కువైందంటే అలజడి. ఆ అలజడితో బాత్రూంలోంచి బయటికి రావడం యిష్టం లేదు. అందుకని మామూలు రుక్మిణిలాగా అయిపోయి అద్దం ముందు నుంచి జరిగిపోయింది.

రుక్మిణి సంజీవరెడ్డినగర్‌లో బస్సెక్కింది. అంతే. లోపలికిమాత్రం వెనక బస్సెక్కిన వాళ్ళే నడిపించారు. ముందుకి, యింకా యింకా ముందుకి. చింతపండు బస్తాలో ఓ చింతపండు రెక్కలా జనం మధ్య నలిగిపోతూ నుంచుంది.

వెంటనే మొదలయింది యుద్ధం. ఒక్క కుదుపుతో బస్సు కదిలింది. మానవ శరీరాలతో యుద్ధం. పై నున్న ఇనప కడ్డీ అందదు. దాని కున్న తోలు హాండిల్ అందుబాటులో లేదు. పక్కనున్న సీటు కానీ, మధ్యలో ఉన్న ఇనుపరాడ్ కానీ, పట్టుకోవాల్సిన అవసరం లేదు. మనుషుల గోడే సురక్ష.

బస్సు ఎక్కడినుంచి వెళ్తుందో తెలీడం లేదు. ఓ రెండు చోట్ల బస్సు ఆగింది. కానీ, ఎక్కడ ఆగిందో, అది ఏ స్టాపో తెలీడం లేదు. మానవ శరీరాల గోడ మందంగా ఉంది. అందుకని బయట ప్రపంచం కనపట్టం లేదు.

''బేగంపేట వస్తే చెప్పు బాబు. బస్సు ఎక్కడి నుంచి వెళ్తోందో తెలీడం లేదు...''

ఎవరిదో గొంతు. మనుషుల మొహాలతో పనేం ఉంది?

'బేగంపేట్, పబ్లిక్ ఇస్కూల్, షాంలాల్...' అని గట్టిగా అరిచిన ఓ రెండు నిమిషాలకి బస్సు ఆగింది.

మానవ గోడలో ఇటికెలు కదిలాయి. అప్పుడే ధైర్యం చేసి, కొంచెం గాలి లోపలికొచ్చింది.

మళ్ళా ఇటికలు సర్దుకున్నాయి. గోడ తయారయింది. గాలి బయటికెళ్ళిపోయింది.

అదృష్టం. రుక్మిణికి బేగంపేటలో సీటు దొరికింది. ఊపిరి పీల్చుకుంటూ తన తొడ మీదకి ఒరిగి పోతున్న శాల్తీని చూసింది. కండక్టరుకి దారి యివ్వడం కోసం తన మీద వాలిందని గ్రహించింది. ఆ శాల్తీ ఓ అమ్మాయి.

అంతేనా! ఆమె వెనకాలే ఉన్న నల్ల పిల్లాడు కూడా కారణమేమో అని అనిపించింది.

కుడి చేత్తో పైన కడ్డీ పట్టుకుని, ఆ చేతి పక్క నుంచి తన మొహాన్ని బాగా వొంచి, ఆమె మెడ దగ్గరగా ఉంచి, బస్సు కుదుపుకి తగ్గట్టుగా తల కదుపుతున్నాడు.

ఆ అమ్మాయికి తన వెనక ఉన్నది ఆడో మొగో కూడా తెలీకపోవచ్చు. తల వెనక్కి తిప్పి చూద్దానిక్కూడా లేనంతగా మనుషులతో నిండి ఉంది.

సిగ్నల్. పెద్ద కుదుపుతో ఆగింది. ఆ కుదుపుకి ఆ పిల్లాడి తల యింకొంచెం ముందుకు వెళ్ళి, మళ్ళీ వెనక్కి వచ్చింది.

గ్రీన్ లైట్. మళ్ళా కుదుపు. ఈసారి ఆ పిల్లాడు ఆమె మెడలోకి తొంగి చూస్తున్నట్లుగా అనిపించింది రుక్మిణికి.

ఇంతమంది ఆడవాళ్ళున్నారు. చాలా దగ్గర దగ్గరగా ఉన్నా తలలు మాత్రం దూరం దూరంగా ఉంచడానికే ప్రయత్నిస్తున్నారు. మరి ఈ పిల్లాడు! వీడేవిటి? వీడి తీరేవిటి? దీన్నేవంటారు? హెరాస్‌మెంట్. అవును ఇది హెరాస్‌మెంట్. సెక్సుయల్ హెరాస్‌మెంట్.

ఏం చేయాలి? ఏదో ఒకటి చేయకపోతే అద్దంలోని గొర్రెకి సార్థకత యిచ్చినట్లే. ప్రతిబింబంలోని రుక్మిణి కనిపించింది. ఆ ప్రతిబింబం అడిగే ప్రశ్నలు, సందేహాలు, సవాళ్ళు అన్నీ ముందుకొచ్చాయి. సకాలంలో పరిస్థితిని మార్చాలి. దానికి కావల్సింది ధైర్యం. అది యిప్పుడు తెచ్చుకోవాలి. వెంటనే ఆమెకి క్లాసులో పిల్లలకి పాఠాలు చెప్పేటప్పుడు కలిగే లాంటి ఫీలింగ్ కలిగింది. ఓ క్లాసులో ఉన్నట్లుగా అనిపించింది. అది ఓ బస్సులా అనిపించలేదు.

తల ఎత్తింది. ఆ నల్ల పిల్లాడు. ఓపిక ఏ మాత్రం లేని వాడిలా తలని పూర్తిగా మోచేతి కోణం లోంచి ఆమె మెడమీదకి వొంచి వాసన పీలుస్తున్నట్టుగా ముక్కుని కదిలిస్తున్నాడు.

వెంటనే తన తలని బాగా పైకెత్తి, కుడిచేత్తో చిటికవేస్తూ ''హలో...'' అంది రుక్మిణి.

ఆ అబ్బాయి కనుచివళ్ళల్లోంచి రుక్మిణిని చూసాడు.

''సరిగా నుంచో. ఏవిటా నుంచోడం? నుంచోడం రాదా! రాకపోతే నేర్చుకో. నుంచుందుకు ఓపిక లేకపోతే, ఎవర్నయినా అడిగి సర్దుకుని కూచో... వెనక్కెళ్ళు...'' ఛీత్కారంగా అంది.

నిండు పేరోలగంలో... తనేనా అన్నది! అది తన గొంతేనా! రుక్మిణికే ఆశ్చర్యం వేసింది.

ఆ నల్ల పిల్లాడు, తన నల్ల జుట్టుని నిర్లక్ష్యంగా పైకెగరేసి తల తిప్పాడు. ఎగిరిన జుట్టు కాకి రెక్కలా స్లో మోషన్‌లో చెంప మీద వాలింది.

''నిన్నే... నీకే చెప్పేది... ఇలా ఈ స్థితిలో ఉన్న నిన్ను మీ అమ్మ కానీ, మీ చెల్లి కానీ, పెళ్ళయి ఉంటే మీ ఆవిడ కానీ చూస్తే ఏవనుకుంటారు? ఛీ ఛీ... నువ్వే కనక నా కొడుకవయ్యి ఉంటే, ఈ ఆడవాళ్ళ వైపుకే రానిచ్చే దాన్నే కాదు. ఒక వేళ వచ్చినా, ఇలాంటిదే చూడాల్సి వేస్తే, ఈ అందరి ముందు రెండు చెంపలూ, వాయించే దాన్ని. చదువుతోపాటూ, సంస్కారం కూడా నేర్చుకోలేని నీ చదువెందుకు?....'' అని అంటూ లేచింది.

బస్సులో ఒక్కసారిగా నిశ్శబ్దం. తలలు అటు యిటూ తిరిగాయి. రుక్మిణి వైపు ఆ అమ్మాయి చూసింది.

''నీ వెనకాల తిక్కవేషాలు వేస్తున్నాడులే. చూసిన వెంటనే బుద్ధి చెప్పాలి. లేకపోతే యింకో రెండడుగులు ముందుకొస్తాడు. ప్రేమ, దోమ అని ఆ తర్వాత పెళ్ళి, కాదంటే నరకడాలు, చంపడాలు, యాసిడ్ పోయడాలు... చావడాలు.... ఇలాంటి పనీ పాట లేని వాళ్ళే చస్తారు...''

బస్సులోని ఆడవాళ్ళ గొంతులు... తలో మాట... వొంగి ఒంగి రుక్మిణిని చూస్తున్నారు.

ఆ సమయంలో రుక్మిణి ఓ లీడర్లా ఫీలయింది.

అవును మరి లీడర్లంతా చేసేది అదే కదా... అందరూ చేసేదే కానీ, యింకొంచెం వేరుగా చేయడం.

ప్యారడైజ్ దగ్గర చాలామంది దిగారు. అందులో ఆ పిల్లాడు కూడా ఉన్నాడేమో, మళ్ళా కనపళ్ళేదు.

ఆ రోజు రాత్రి... తొమ్మిది గంటలకి, వంటింటి లైటార్పి తలుపేసి బయటికొచ్చింది.

ఇంటరు చదివే కూతురు కుడిచేతి వేళ్ళని నుదుటి మీదుంచి, ఎడం చేత్తో, భుజాల మీద వాలిన జుట్టు కొసళ్ళని ఉంగరాలు తిప్పుతోంది. అది చదువుతోందో లేదో డౌటే.

పదో క్లాసు చదువుతున్న కొడుకు చేతిలో ఫిజిక్స్ అట్ట ఉన్న పుస్తకం. చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉండి ఉంటుంది ఆ పుస్తకం. డెఫినిట్‌గా ఆ ఫిజిక్స్ అట్ట వెనకాల సిడ్నీ షెల్డనో, పెర్రీ మాసనో, చేజో ఉండే ఉంటారు.

భర్త మాధవ్ యథా ప్రకారం అసెంబ్లీ సమావేశాల్ని, చర్చల్ని దెబ్బలాటల్ని చూస్తూ ఎంజాయ్ చేస్తున్నాడు.

అదే సమయం. తన సమయం. తన ప్రపంచంలోకి అడుగుపెట్టింది. వాష్ బేసిన్ పైనున్న అద్దంలో మొహం చూసుకుంది రోజూలాగే.

అదే ప్రతిబింబం. కళ్ళకింద నీలి ఛాయలు. జారిన దవడలు. కళ్ళజోడు ఆనవాళ్ళు. ముక్కు పక్కన గీతలు. రంగేసుకున్న జుట్టు. అదే తను ఎప్పుడూ కనపడే రుక్మిణి ప్రతిబింబం అది. కానీ ఎప్పుడూ కనపడేదిగా కనపళ్ళేదు. అది మందలో గొర్రె. ప్రతిబింబం వెనకాల గొర్రె లేదు.

ఇన్నాళ్ళూ కనపడనిది ఏదో కనిపించింది. అందుకే రుక్మిణికీ ఓ చిన్నసందేహం లాంటిది వచ్చింది. తనేనా, కానీ, అదే తనే. నలభైయైదేళ్ళ అయినా మొహం బాగానే ఉంది. కానీ నిన్నటి



వరకూ లేనిది ఇవాళ ఏదో కనిపిస్తోంది. ఆ ఏదోలో ఏదో కొత్తదనం. అది నిన్నటి వరకూ లేదు. మరి యివాళే ఎందుకు కనిపిస్తోంది? ఇవాళ బస్సులో జరిగిన సంఘటన వల్లనా? తన ముఖంలోని మార్పు దానివల్ల వచ్చిందా! ఆ మార్పు ఎదగడంలోకి వస్తుందా! అదే చైతన్యం అవుతుందా!

ఎప్పుడు లాగా ప్రతిబింబం, అద్దానికివతలున్న రుక్మిణిని ప్రశ్నలతో సంధించలేదు. సందేహాల నివృత్తి కోరలేదు. కొత్తదనం సంతరించుకున్న ప్రతిబింబాన్ని సంతృప్తిగా చూసుకుని బాత్రూం లోంచి బయటికొచ్చింది.

ఓ మధ్యాహ్నం స్టాఫ్‌రూంలో అందరూ భోం చేస్తున్నారు. మిసెస్ తివారీ, ఎప్పటిగానే గంజి పెట్టిన నేత చీరని పరపరలాడించుకుంటూ, ఎర్ర రంగేసిన పెదాలని కదిలించకుండా నవ్వుతూ వచ్చింది. అందర్నీ ఓసారి చూసింది.

''క్షమించండి... ఈ టైములో రాకూడదు. కానీ రావాల్సి వచ్చింది. సంస్కృతి సంస్థ మన ఏరియాలో ఉన్న స్కూళ్ళకి, కాలేజీలకి ఏవేవో పోటీలు పెడ్తోంది. ఓ గంట ముందు టాపిక్ యిస్తారుట. ఆ టాపిక్ మీద పెయింటింగ్, ఎస్సే రైటింగ్, ఎలొక్యుషన్, డిబేట్ ఉంటాయిట. ఓ పది మందిని సెలెక్ట్ చేసాం. వాళ్ళని, హరిహర కళాభవన్‌కి తీసుకెళ్లాలి. సుమో కూడా రెడీగా ఉంది. మీలో ఎవరో ఒకరు వాళ్ళతో వెళ్ళాలి. అక్కడ వాళ్ళతో కూచుని పాయింట్స్ డిస్కస్ చేయాలి... వాళ్ళని ప్రిపేర్ చెయ్యాలి.''

''మిసెస్ నరేందర్ కౌర్ కదా, యిలాంటి యాక్టివిటీస్‌కి...'' ఆ మాటలు అన్న వాళ్ళవైపు చూసింది. అదే నవ్వు.

''మీరడుగుతారని నాకు తెలుసు. కానీ, నరేందర్ డిసెంబర్‌లో జరిగే ఫంక్షన్ కోసం డాన్సులు అవీ నేర్పిస్తోంది..'' అంటూ టైము చూసుకుంది.

నిశ్శబ్దం... ఎవరూ మాట్లాడలేదు.. ఆమె వైపు చూడ్డానికే భయపడ్డారు.

''రుక్మిణీ... నువ్వు....''

రుక్మిణి గుండె గుబగుబలాడింది. ఇంతమందిలో తనొక్కత్తే ఈవిడగారికి కనిపిస్తుంది. ఎప్పుడూ యింతే.... ఇబ్బందిగా గుటకవేసింది. ''హోదాలో, వయసులో, చదువులో, అనుభవంలో, జీతంలో అన్ని విధాలా తనకన్నా ఎక్కువే. అందుకే మొహమాటం. మరి ఆ మొహమాటం తన తోటి లెక్చరర్లకి లేదేం..? ఎప్పుడూ నేనేనా! దసరా దీపావళి పండగలొస్తున్నాయి. ఎన్నో కొనాలి. వీళ్ళలాగే తనకీ టైం ప్రెషియస్. వెళ్ళను గాక వెళ్ళను' అని అనుకుంది.

వెంటనే తల అడ్డంగా ఊపింది. ''పని ఉంది మేడం... నవరాత్రులు మొదలవుతున్నాయి కదా... షాపింగ్ ఉంది..''

అదే చిరునవ్వు... ఫర్వాలేదు లే అన్నట్లు తల, కళ్ళు తిప్పింది.

''డోంట్ వర్రీ... నువ్వెప్పుడూ 'నో' అనవు... ఆ సంగతి నాకు తెలుసు.. నో ప్రాబ్లెం... యింకెవర్నైనా అడుగుతాను.. మిసెస్ నటరాజన్ మీరూ... మీరేవంటారూ?''

నటరాజన్ ఏవందో తెలీదు. విన్లేదు. ఎందుకంటే, మొదటిసారి గంగిరెద్దులా తలూపకుండా, మొహమాటంతో సరే అన్లేదు. అందుకని తనని తాను అభినందించుకుంటూన్న ఆ ఆనంద హోరులో ఆమెకేం వినపళ్ళేదు.

తన మంచితనాన్ని ఎక్స్‌ప్లాయిట్ చేస్తోందన్న భావం ఆమెలో కలిగింది. అందులోంచే నేనే ఎందుకన్న ప్రశ్న పుట్టింది. ఆ జవాబు వెతకడంలో చైతన్యం వచ్చింది. రుక్మిణిలో మార్పు వచ్చింది.

★

గంటి భానుమతి

040-27151439

## శిల్ప పెళ్లి వాయిదా....



పొడుగు కాళ్ళ సుందరి, బాలీవుడ్ అందాల తార శిల్పాశెట్టి పెళ్లి వాయిదా పడిందట! ఈ సంవత్సరం రాజ్ కుంద్రా, శిల్పాశెట్టిలు పెళ్ళి చేసుకోబోతున్నారని అందరూ గట్టిగా నమ్మారు. అయితే అది కాస్తా వాయిదా పడింది. దీని వెనుక ఉన్న సూత్రధారి సన్ని డియోల్. సన్ని డియోల్ చొరవతోనే శిల్పా పెళ్లి వాయిదా పడిందట! ప్రస్తుతం చేస్తున్న సినిమాలు పూర్తి అయిన తరువాతే పెళ్లి చేసుకోమని సన్ని, శిల్పకు సలహా ఇచ్చాడట! ఆ సలహా శిల్ప తు.చ. తప్పక పాటించిందని అంటున్నారు. రాజ్‌కుంద్రా మాత్రం ఈ విషయంలో ఏం మాట్లాడకుండా మౌనంగా ఉండడం పలు అనుమానాలకి తావిస్తోందని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి.

★

With Best Compliments From

Ph: 23079802

UNIVERSAL TRADING CORPORATION

89, Panchaseela Colony,
Opp. Pragathi School,
IDA Gandhi Nagar,
Hyderabad - 500 037

Dealers in : Industrial Oils & Greases and
General Order Suppliers